క్లుప్తంగా

నేడు పెద్దచింతకుంటలో మహోత్సవం

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో మంగళ, బుధవారాల్లో గ్రామ పూజ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు సోమవారం శివస్వాములు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీశైల ప్రభు గురుస్వామి ఆధ్వర్యంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహా పడిపూజ, కుంకుమార్చన వీరభద్రుని సేవ, నందికోళ్ల సేవ, అగ్ని గుండ ప్రవేశం ఉంటుందని తెలిపారు. బుధవారం తెల్లవారు జామున కల్యాణ మహోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. అధిక సంఖ్యలో శివస్వాములు, గ్రామస్తులు తరలివచ్చి పూజ వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

ఘన సన్మానం

మరికల్: జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన ధన్వాడ లంకాల శ్రీనివాస్‌గౌడ్‌ను సోమవారం జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీరామ్ సన్మానించారు. నారాయణపేట జిల్లాలో బీజేపీని బలోపేతం చేసేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

సమయపాలన పాటించాలి

మరికల్: తీలేర్ ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయులు సమయ పాలన పాటించక ఇష్టానుసారంగా వచ్చిపోయే పద్ధతి మార్చుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల సమయానికి రాకుండా ఎప్పుడు పడితే అప్పుడు వస్తూ విద్యార్థుల చదువుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు ఉపాధ్యాయులు హెచ్‌ఎం మాటలను సైతం లెక్క చేయక మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోతున్నారని, అలాంటి వారిపై డీఈఓ చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయుల తీరు మార్చుకోకపోతే మూల్యం చెల్లించుకుంటారని పేర్కొన్నారు.

అండర్ కేబుల్ లైన్ పనుల పరిశీలన



మాగనూర్: మండలంలోని వడ్వాట్ గ్రామంలోని శివాలయం ఎదుట జాతర సమయంలో రథోత్సవం కార్యక్రమానికి ఇబ్బందికరంగా 33 కేవీ విద్యుత్ లైన్ అడ్డుగా ఉన్నాయని గ్రామస్తులు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సంబంధిత విద్యుత్ అధికారులకు అండర్ కేబుల్ వర్క్ చేయవల్సిందిగా ఆదేశించడంతో సోమవారం సిబ్బంది పనులు మొదలు పెట్టగా.. ఎమ్మెల్యే పనులను పరిశీలించారు. దీంతో గ్రామస్తులు ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయన గ్రామంలో నిర్వహించిన శివ మహాపడిపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వడ్వాట్ మాజీ సర్పంచ్ రవీందర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థికసాయం అందజేత



మక్తల్: నిరుపేద విద్యార్థులను ఆదుకోవడమే తన లక్ష్యమని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ చిట్యాల నిజాంపాషా అన్నారు. మండలంలోని గుర్లపల్లికి చెందిన అక్కాతమ్ముడు మోహన్, స్వప్న షూటింగ్ బాల్ క్రీడల్లో జాతీయ స్థాయికి ఎంపికకావడంతో వారిని సోమవారం పట్టణంలో చిట్యాల నిజాంపాషా శాలువాతో సన్మానించారని విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. అనంతరం వారికి రూ.15 వేల ఆర్థికసాయం అందించారు. స్వప్న మార్చి 2 వ తేదీ నుంచి 4వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే ప్రపంచస్థాయి షూటింగ్ బాల్ పోటీలో పాల్గొననుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలో ఉత్తమ ప్రతిభ చూపి తల్లిదండ్రులు వెంకటప్ప, మణెమ్మ, పీఈటీలు రమేష్, రూప, అంబ్రేస్ పేరు నిలబెట్టాలని ఆకాంక్షించారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు

- మండలంలో గ్రామాలకు మట్టిరోడ్లు
- నక్ష రోడ్డు లేక పొలాల్లో ప్రయాణం
- పట్టించుకోని అధికారులు



ఊట్కూర్ నుంచి సమస్తాపూర్ గ్రామానికి మెటల్ రోడ్డు

ఊట్కూర్: మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్ల సౌకర్యం లేక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఏర్గాట్‌పల్లి, జీర్ధహళి, వల్లంపల్లి, చిన్నపోర్ల-ఎడివెల్లి, చిన్నపోర్ల-పులిమామిడి, నిడుగుర్తి-పెద్దజట్రం, ఊట్కూర్-అమీన్‌పూర్, ఊట్కూర్-సమస్తాపూర్, కొల్లూర్-నాగిరెడ్డిపల్లి, బాపూర్-నిడుగుర్తి తదితర గ్రామాలకు మట్టి రోడ్లు ఉన్నాయి. మట్టి రోడ్లు, మెటల్ రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. పలు గ్రామాలకు రెవెన్యూ నక్ష ప్రకారం రోడ్లు గుర్తించకపోవడంతో ప్రజలు పొలాల మధ్యలో రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలం గుంతల్లో నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల రోడ్లకు ఇరువైపులు ముళ్లపొదలు పెరిగాయి. ద్విచక్రవాహనాలు, ఆటోలలో వెళ్లేందుకు తీవ్రఇబ్బందులు పడాల్సి వస్తుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్ల సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

మండలంలో రోడ్లు ఇలా..

- వల్లంపల్లి, ఏర్గాట్‌పల్లి గ్రామాలకు 3 కి.మీ. మెటల్ రోడ్డు
- జీర్ధహళ్లి గ్రామానికి 3 కి.మీ. మట్టి రోడ్డు
- చిన్నపోర్ల నుంచి ఎడివెల్లి గ్రామానికి 2 కి.మీ.



జీర్ధహళ్లి గ్రామానికి రోడ్డు ఇలా..

- చిన్నపోర్ల నుంచి పులిమామిడి గ్రామానికి 3 కి.మీ. మట్టిరోడ్డు
- పెద్దజట్రం నుంచి నిడుగుర్తి గ్రామానికి 3 కి.మీ.
- పెద్దజట్రం నుంచి మొగ్దంపూర్ గ్రామానికి 3 కి.మీ మట్టి రోడ్డు
- ఊట్కూర్ నుంచి అమీన్‌పూర్ గ్రామానికి 5 కి.మీ మట్టి రోడ్డు
- ఊట్కూర్ నుంచి సమస్తాపూర్ గ్రామానికి 3



పెద్దజట్రం-నిడుగూర్తి గ్రామాల మట్టి రోడ్డు

కి.మీ మెటల్‌రోడ్డు

- కొల్లూర్ నుంచి నాగిరెడ్డిపల్లి గ్రామానికి 2కి.మీ. మట్టిరోడ్లు

బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి..

మండలంలోని పలు గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టి రోడ్లు, మెటల్ రోడ్లపై వర్షాకాలంలో గుంతలు ఏర్పడి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పలు గ్రామాలకు రెవెన్యూ నక్ష ప్రకారం రోడ్డు లేకపోవడంతో రైతులు పొలాల్లో వెళ్తున్నారు. అధికారులు స్పందించి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– నారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు, ఊట్కూర్

ఎమ్మెల్యే బీటీ రోడ్ల కోసం కృషి చేయాలి

మా గ్రామం నుంచి మొగ్దంపూర్ వరకు, నిడుగుర్తి వరకు మట్టి రోడ్లు ఉన్నాయి. వర్షాకాలంలో మట్టి రోడ్లపై నీరు చేరడంతో ప్రజలు ప్రయాణించేందుకు ఇబ్బందులకు గురువుతున్నారు. గతంలో బీటీ రోడ్డు కోసం అధికారులకు, నాయకులకు వినతి పత్రాలు ఇచ్చాం. ఇప్పటికైనా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి స్పందించి గ్రామాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించేందుకు కృషిచేయాలి.

– కనకప్ప, పెద్దజట్రం, ఊట్కూర్

- బాపూర్ నుంచి నిడుగూర్తి గ్రామానికి 2 కి.మీ. మట్టి రోడ్డు

కనులపండువగా విగ్రహాల ప్రతిష్ఠ



నవగ్రహ విగ్రహాలను ప్రతిష్ఠిస్తున్న భక్తులు

మరికల్: మండలంలోని బుడ్డాగానితండాలో ఆంజనేయ, శివాలయ స్వామి ఆలయ ఆవరణలో సోమవారం నంది, నాగదేవత, నవగ్రహాల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అంతకు ముందు బ్రాహ్మణులు విగ్రహాలను భక్తి శ్రద్ధలతో ప్రాణ ప్రతిష్ఠ పూజలు చేశారు. అనంతరం హోమం, పూర్ణాహుతి మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామంలో రెండు రోజుల పాటు విగ్రహాల ప్రతిష్ఠ ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో శివ స్వాములు, తండావాసులు తదితరులు పాల్గొన్నారు.



నంది విగ్రహాలకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

విద్యార్థుల సామర్థ్యాలు పెంచేలా బోధన



ప్రార్థనకు హాజరైన ఎంఈఓ వెంకటయ్య

మక్తల్: మండలంలోని చిట్యాల ప్రాథమికోన్నత పాఠశాలను సోమవారం ఎంఈఓ వెంకటయ్య, నోడల్ అధికారి అనిల్‌గౌడ్ తనిఖీ చేశారు. ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు. పరీక్ష సమయం సమీపిస్తున్న ఉపాధ్యాయులు సెలవులు తక్కువగా తీసుకోవాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని, మెనూ ప్రకారంగా మధ్యాహ్న భోజనం నాణ్యతగా వడ్డించాలన్నారు. తాగునీటి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు టీఎల్ఎం బోధన సామగ్రిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విభీషణ్‌కుమార్, రవీందర్‌రెడ్డి, వరలక్ష్మి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోక్షశెట్టి

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యువ జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థితికి వెళ్లడానికి ఏర్పాటు చేసుకోవాల్సిన లక్ష్యాలను ట్రినర్‌లు ఊరుకొండశెట్టి, మోక్షశెట్టి వివరించారు. పరీక్షల్లో 10శాతం జీపీఏ సాధించాలంటే సబ్జెక్ట్‌లపై పట్టు ఉండాలని, అందుకోసం తీసుకోవల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 850 మంది విద్యార్థులు పాల్గొన్నారు. యువ జాగృతి చైర్మన్ మధుసూదన్ రెడ్డి, నారాయణపేట జిల్లా డీవైఎస్ఓ వెంకటేష్, హెచ్‌ఎం రమేష్‌శెట్టి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరా మెరుగుపర్చాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ జయరాములు

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సరఫరాను మెరుగుపర్చాల్సి ఉందని ఎంపీడీఓ జయరాములు అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి టీఏలు, మిషన్ భగీరథ సిబ్బందితో తాగునీటి సరఫరా, నర్సరీల నిర్వహణ, ఉపాధి పనులపై సమీక్ష నిర్వహించారు. చాలా గ్రామాల్లో నీటి ట్యాంకులు నిండకుండానే నిండినట్లు ఫొటోలు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇన్‌టెక్ వెల్ నుంచి వచ్చిన నీటిని ట్యాంకుకు, అక్కడి నుంచి కుళాయిలకు సక్రమంగా సరఫరా జరగాలని ఆదేశించారు. గ్రామాల్లో నర్సరీల పెంపకం, ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. అలాగే ముదుగుదొడ్ల నిర్మాణం పరిశీలన, పీఎం విశ్వకర్మ దరఖాస్తులు పెంచాల్సి ఉందని సూచించారు. అంతకుముందు కొమ్మురులో ఎంపీడీఓ, ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్‌తో కలిసి పాఠశాల, నర్సరీ, ఉపాధి పనులు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీఓ విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం కృషి చేస్తా



వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటప్పను సన్మానిస్తున్న నాయకులు

నారాయణపేట: వ్యాయామ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం జిల్లాలో క్రీడల అభివృద్ధికి పాటుపడతానని వ్యాయామ ఉపాధ్యాయల సంఘం నూతన జిల్లా అధ్యక్షుడు వెంకటప్ప అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో పీఈటీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి గౌడ్, గద్వాల జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్యల సమక్షంలో నారాయణపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నారాయణపేట జిల్లా శాఖ గౌరవ అధ్యక్షులుగా నర్సింహులు, అధ్యక్షులుగా వెంకటప్ప, ఉపాధ్యక్షులుగా అనంతసేన, ఫర్వీన్‌బేగం, ప్రధాన కార్యదర్శులుగా బాలరాజు, సంయుక్త కార్యదర్శిగా సాయినాథ్, కోశాధికారిగా విష్ణువర్ధన్‌రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వెంకటప్ప మాట్లాడుతూ నారాయణపేట జిల్లా నుంచి క్రీడాకారులను రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించేలా కృషి చేస్తామన్నారు. అందరి సహకారంతో ముందుకు వెళ్లి తనకు అప్పగించిన బాధ్యత పూర్తి బాధ్యతాయుతంగా చేపడతానన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకున్న కమిటీని పూలమాల, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



మరికల్: ఉమ్మడి జిల్లా కరాటే టోర్నమెంట్‌లో మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. సోమవారం మాగనూర్‌లో జరిగిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో గౌతమ్ మోడల్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. త్వరలో వీరు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే బ్లాక్ బెల్ట్ పోటీల్లో పాల్గొంటారని మాస్టర్ శేఖర్ తెలిపారు. సందర్భంగా కరస్పాడెంట్ రాజేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయ బృందం కరాటే విద్యార్థులను అభినందించారు.

ప్రతి గ్రామంలో సీసీ రోడ్లను నిర్మిస్తాం



కృష్ణా: మండలంలోని ప్రతి గ్రామంలో పూర్తి స్థాయిలో సీసీ రోడ్లు నిర్మిస్తామని, గ్రామాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజప్పగౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని ముడుమాల్‌లో బీసీ కాలనీలో రూ.10లక్షలతో నిర్మించే 110 మీటర్ల సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సిములు, వెంకటేష్, తిమ్మప్ప, భీమ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నర్వ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 84 మందికి చెక్కులు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ రాష్ట్ర కమిటీ సభ్యులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు క్రిష్టారెడ్డి, సిరజ్, శరణప్ప, వివేకవర్ధన్‌రెడ్డి, మహేష్, రవిసాగర్, కొండన్న, ఆయా గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: ధన్వాడ మండల కేంద్రంలో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సింధుజా ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9గంటలకు ధన్వాడలో 36 మందికి చెక్కులు పంపిణీ చేయనున్నట్లు ఆమె తెలిపారు.

బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవం



నర్వ: మండలంలోని జక్కన్నపల్లిలో సోమవారం బొడ్రాయి పునఃప్రతిష్టాపన, పోతురాజు, జంటనాగుల ప్రతిష్టాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉత్సవాలను తిలకించేందుకు టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు చెల్లించారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



మక్తల్‌లో ఎంపీపీఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులైన విద్యార్థులు

మక్తల్: మక్తల్ పట్టణంలో ఎంపీపీఎస్‌లో విద్యార్థులు సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించారు. కలెక్టర్‌గా ఆంజనేయులు, ఎంఈఓ మధుప్రియ, డీఈఓగా అక్షిత, ఎచ్‌ఎం శివాని, కొందరు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థి ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీఎచ్‌ఎం అనిల్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రాములు, వెంకటేష్, కాంతలక్ష్మి, గోపాల్, చంద్రశేఖర్, తిరుమల్‌రావు, కుర్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కోస్గి: గుండుమాల్ మండలంలోని హన్మాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. పాఠశాల హెచ్‌ఎంగా శిరీష, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎం నర్సిములు, ఉపాధ్యాయులు నరేష్, అనంతయ్య పాల్గొన్నారు.

మీర్జాపూర్ పాఠశాలల్లో...

కోస్గి మండలంలోని మీర్జాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని వేడుకగా జరుపుకొన్నారు. కలెక్టర్లుగా సిద్ధు, శ్రీకాంత్, డీఈఓలుగా తిరుపతి, నందిని, ఎంఈఓగా ప్రణవి, హెచ్‌ఎంలుగా నవీన్ కుమార్, సబితాతోపాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పాఠశాల హెచ్‌ఎంలు సిద్ధిరాములు, భానుప్రకాష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు



హన్మాన్‌పల్లిలో..

భక్తిశ్రద్ధలతో మహాపడి పూజ



జౌళాపూర్‌లో జ్యోతిర్లింగాలకు పూజలు చేస్తున్న శివభక్తులు

మక్తల్: మండలంలోని జౌళాపూర్‌లో సోమవారం శివ మాలధారులు మహా పడిపూజను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శివ మాలధారులు గ్రామంలో పురవీధుల గుండా కలశాల తీసుకొని భజనల, భక్తి కీర్తలనతో ఊరేగింపుతో వెళ్లారు. ఉదయం 11గంటల నుంచి 2గంటల వరకు ఆలయం వద్ద మహా పడిపూజ నిర్వహించారు. పూజ కార్యక్రమంలో జ్యోతిర్లింగాలకు పూజలు చేశారు. శివధ్వజ, విఘ్నేశ్వరస్వామి, ద్వాదశ జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు చేశారు. శివ దీక్షాపరులు ఆలపించిన భక్తి సంకీర్తనలు, భజనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

మాగనూర్: మండలంలోని వడ్వాట్‌లో శివ మాలధారుడి ఇంట్లో సోమవారం మహాపడి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భజనతో పాటుగా మహాయాగం, మెట్లపూజ, గంగాపూజ, 108 కలశాల పూజ, జ్యోతిర్లింగాల మహాపూజ, శతకుంభాభిషేకం, మహామంగళహారతి, అన్నదానం నిర్వహించారు. గురుస్వాములు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తప్పకుండా దైవభక్తి కలిగి ఉండాలని, ఆ పరమశివుడి కృప కలిగి ఉంటే అంతా శుభమే జరుగుతుందని తెలిపారు. గ్రామం మొత్తం శివనామస్మరణతో మార్మోగిపోయింది. మండలంతో పాటు, వివిధ గ్రామాల శివ దీక్షాపరులు 450 మందికి పైగా పాల్గొన్నారు.



కొత్తపల్లిలో..

శ్రీశైలానికి పయనం

మాగనూర్ మండలంలోని కొత్తపల్లిలో శివ మాలధారులు స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం ఇరుముడి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించి, శ్రీశైలానికి బయలుదేరారు. ఈ సందర్భంగా గురుస్వాముల ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో మహాపడి పూజ సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పార్వతి పరమేశ్వర్లకు అభిషేకాలు, అర్చనలు జరిపించారు. మల్లన్న నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. అనంతరం భక్తులకు అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. శివ మాలధారులను భక్తిగా ఆంజనేయస్వామి ఆలయం నుంచి గ్రామ పొలిమేర వరకు దాదాపుగా ఒక కిలో మీటరు మేర ఊరేగింపు నిర్వహించి శ్రీశైలానికి సాగనంపారు. శివస్వాములు శ్రీశైలం నుంచి జ్యోతిర్లింగాల దర్శనానికి వెళ్లనున్నట్లు తెలిపారు.

'బీజేపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి'



మాట్లాడుతున్న కేశం నాగరాజుగౌడ్

ఆత్మకూర్: జాతి విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తున్న బీజేపీకి రోజులు దగ్గరపడ్డాయని టీపీసీసీ అధికార ప్రతినిధి, రాష్ట్ర గీత కార్మిక డిపార్ట్‌మెంట్ చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో జిల్లా కిసాన్‌సెల్ సమావేశాన్ని నిర్వహించారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని దేశ రాజధాని ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై కేంద్రం దమనకాండ చేపడుతూ లాఠీలతో కొట్టిస్తున్నారని మండిపడ్డారు. రైతుల ఉసురు ఊరికే పోదని, దేశానికి అన్నం పెట్టే రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న బీజేపీ ప్రభుత్వం భారీమూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ కిసాన్‌సెల్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ఈనెల 28న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం నుంచి నెక్లెస్ రోడ్డు వరకు చేపట్టనున్న భారీ ర్యాలీలో రైతులు, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, పాండురంగ, రహ్మతుల్లా, తులసీరాజ్‌యాదవ్, పరమేష్, శ్రీను, లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆదుజ్, భగవంతు, భాస్కర్, కృష్ణయ్య, రఘు, అజ్మత్, గంగ, దస్తగిరి ఉన్నారు.